# రూపాయి బిళ్లలు

లలితా శ్రీనాథ్

మనవాళ్ళ సంపతరెడ్డా ? ఔ, దొరా, నాకు బాగానే గ్యాపకం. ఇనపరాయి వెతకడానికి పెద్ద కొండమీదకి వెళ్ళిన గ్యాంగులో నేనూ వుంటినిగా !

ఆ యెల్లటమే. మళ్ళీ రెడ్డి తిరిగి రానేలేదు.

మరేమయి పొయ్యాడు ? అని అడుగుతుంటివా ? ఎట్టా దొరా ? ఆ పెళ్నకి ఎవ్వడూ సరింగ సెప్పలేడు. నేను కూడ సెప్పలేను, నేనంటే మరి ఏమనుకుంటిరి దొరా ? మా కొండజాతోళ్ళందరికంటె ఎక్కువ సదువుకున్నాను. అనేక పట్టణాలలో తిరిగొచ్చినాను. మరి నాకు తెలియకుండ ఈపెద్ద కొండ, చిన్నకొండ, మరిడమ్మ కొండ, సుట్టుపక్కల ఏత్తై గూడేలలో నీమకూడ సిటుక్కుమన్దు.

నా కర్థమయిందిలే దొరా. నువ్వేం ఎఱ్ఱిబుట్టవికాదులే. ఇంసూరు కంపెనోడివి. మరి, మరిడమ్మ కొండపక్కరోడ్డు ఏసినప్పుడు, లారీలో పనిచేసి. అది బోల్తా కొట్టంగాను ఇంసూరులో డబ్బు తిరిగి రాబట్టిన చౌదరయ్య కుడిబుజము కదటయ్యా నేను !

రెడ్డి సచ్చిండు అని సబూత్ కావాలంటవు ? అంతేనా. మరి నాకు తెలిసినయిదంగా కదంతా జెపుదును. అందులో అడు సచ్చిండో బతికిండో నీవే ఆలోచించుకో. నేను సెప్పలేను.

ముందు గుంట నువ్వుకూచుకో దొరా. కదయితే మరి పెద్దది.

మరయితే, నీవు రెడ్డిని ఎరుగున్నోదివేనా ? చూడ్లే ? పెద్ద ఆకారము, మంచి పొడువు. కళ్ళు రెండు సాలయ్యా, ఎట్టాటోడేనా హడలి సావాల్సిందే. బొంగురు గొంతు. మీలాటి దొరలంతా, కోపమొస్తే కుక్కలతో ఎట్టా మాటాడుతారో, ఆడు మామూలుగా మాలాటి మడుసులుతో అట్ట మాటాడుతాడు.

నీ కర్దమవలే దొరా. మా కొండోళ్ళకి కోపం చాల మెల్లంగా వస్తది. అది సూని మీ పట్టణంవోళ్ళు శాతకాని తనమో, భయమో అనుకుంటురు. ఆఖరికి మీకే తెలుస్తది.

కంగారు పడమోకు దొరా. నే సెప్పేది మనవాళ్ళ సంపతరెడ్డి కత. అది నీకు అర్దమవాలంటే అడి నోరు, మనసు రెండూ నీకు తెలియాల.

ఔ, ఇక ఆడోళ్ల రోడ్డుమీద అడ్డెలితే సాలు. ఆడి ఒల్లంతా కళ్ళే. నీకు తెలందేటి దొరా ! మా బీద జాతోళ్ళకి సొక్కాలు, పెద్దకోకలుంటయా ? ఇక రెడ్డిగాడుద్దేశము మా ఆడోళ్ళ అడ్ని సూని సొక్కాఇప్పేసినట్టే !

ఇసుకోక్కు దొరా. మరి మేమంతా అడ్ని ఎట్టనుకున్నమో, అట్టనే నువ్వనుకోపోతే, ఆడు సివంగిని సూసిన తరవాత జరిగిన కతలో ఎవడిది తప్పో నీకెట్టా తెలుస్తది ?

ఔ. దొరా. చౌదరయ్యకూడా పట్టపోడే. అయితే నేం, ఇరవై సంవత్సరాలకితం బాపనపాలెంవచ్చి అక్కడే మా కులందాన్ని మనువాడి అరుగురు పిల్లల్ని కన్నాడు. ఆ చౌదరయ్య పెద్దకూతురే సివంగి.

అయితే, యిక జరిగింది జరిగినట్టు సెపుతాను యిను దొరా. అయ్యాలకూడా ఇట్టనే ఈ కొండకిందే రెడ్డి చౌదర్ని కలిసిండు. మా సుట్టుపక్కల వూర్లకంతా తుపాకి వున్నోడు చౌదరీ ఒక్కడే. అతగాడ్ని సూస్తేనే మాకు బయం. అట్టాటోడ్ని పుటుగుని పలకరించినట్టే రెడ్డి :

"ఏందయ్యా, చౌదరయ్యా. నీవూరు పక్కనించే పెద్ద కొండకి దోవంట. నీతో దాటు నన్నుకూడ మీ గూడెండాకా నడిపిస్తివా నీకు పదిరూపాయబిళ్లలు ముట్టవి."

ముంగల చౌదరయ్యకి యింత ఎండలో పయానం ఇట్టం లేకపోయినా, రూపాయి బిల్లలెట్ట దొరుకుతాయి ? సరే. మేం ఆరుగురం సామాను మోతకి, అళ్ళిద్దరూ, పొద్దుటేల బయదెల్తిమి.

కాని. సూసో్క దొరా ! మా అందరికంటె యెక్కువ బరువుతో రెడ్డి ముంగలన పరుగులాంటి నడక. ఎనక మేము.

కాని, అయ్యాలకాసిన ఎండ, ఎట్టంటిదో నాను సెప్ప నేను దొరా ! ఏడి గాలికి ముక్కులోం చొచ్చే. పొయ్యేగాలికూడా తడిలేదు. ఒకటే ఆవిరి.

అట్టట్టా, పరుగు నటకతో, సూర్యుడు నెత్తిమీద కొచ్చిండు. మాలో అందరికన్న బొట్టెడయిన చెంచిగాడు, ఇక బరించలేక సతికిల బడ్డడు.

ఇక, సూసుకో దొరా ! ఆ రెడ్డిగాడి కోపము. మా కందరికి ఒళ్ళు మంటగానే వుంది. మొల్లో కత్తులున్నయి. కాని ఎదురుంగా కత్తి ఎత్తలేక పోయినాము. చెంచిగాడి అన్న ఎనకపాటున దూసుకున్నడు కాని, ఆ రెడ్డిగాడు పసికట్టి అడిచెయ్యి పట్టేసిండు. ఆడి జిమ్మడ ! కోట్నుంచి తీసిండయ్యా ! సిన్న తుపాకీ. అంతే ! మళ్ళీ ఎవళ్ళమూ ఇంక కూకుంది లేకుండా సీకటి పడ్డదాక మళ్లీ పరుగు.

సరే దొరా ! ఆ రాత్రికి అడవిలో మకాము. సూర్యుడు లేచిన మధ్యాన్నము బాపనపాలెం చేరేసరికి పుస్సరబ్బా, బతుకుజీవుడా !

మా జనం, మా మూట్లు చూసేసరికి చూసేసరికి పరుగుపరుగున వచ్చింది దొరా, చౌదరయ్య పెద్ద కూతురు సివంగి..

ఔ దొరా అట్టనే ఆ పిల్లను సూస్తూ సూస్తూ నిలబడిపోయిండు రెడ్డి.

మరీ, ఆపిల్ల అందం నేనెట్ల వొర్ణించను దొరా? నేనెంత సెప్పినా- అపిల్ల అంత కంటె వెయ్యిరెట్లు అందంగా వుంటది. ఆ పిల్ల ఇంక మాకేసి సూత్తేనా! ఆళ్ళ బాబుకేసి సూత్తేనా? అంతే. ఆరెడ్డిగాడి కేసి మంత్రమేసిన దానిలా సూత్త నిలబడి పోయింది దొరా.

అయితే, అందులో ఆపిల్ల తప్పునేదు దొరా. ఎప్పుడు పట్టంగూడ పోనేదు. అసలు మీలాంటి మడుసుల్ని సూడ్నేలేదు. అది సూసి రెడ్డిగాడు మొదటిసారింగ నవ్వం డయ్యా! యిసపునవ్వు. దాంతో మూడే ముక్కలు అన్నండు: "ఏ పిల్లా ఇలారా"

అంతే!

చౌదరయ్య అడ్డుపడి కొంపకి తోలు కెల్లక పోతే, సివంగికి, జంగం దొరకి మనువు కాదనుకో దొరా.

అక్కడితో ఆగాల్నా రెడ్డిగాడు. అంటాడూ: "చౌదరయ్యా! ఎంతకాలం ఇంటో తాలవేస్తావు? నేను ఇనపరాయి ఎతికి యింటికి ఎళ్ళేలోపున నీ కూతుర్ని నాదాన్నిగా నేసోక్కపోతే నాపేరు మనవాళ్ల సంపతరెడ్డేకాదు."

అన్న పెకారం పది రూపాయ బిళ్ళలు చౌదరీమీద యిసిరి మకాంకు మళ్ళండు రెడ్డి. ఆడి ధైర్యం మండ. అడన్నాడంటే సేసేసే వోళ్లా గున్నాడు. ఆ రేత్రికి రేతిరే పెద్దకొండ మీదనుంచి జంగం దొరనీ, ఆడిస్నేహితుల్ని రప్పించిండు చౌదరయ్య.

ఔ, దొరా! మాలో మనువుకంటే పదానం కానా పెద్ద యిశయం. ఆ రేతిరి జంగం దొరకి, సివంగికి పదానం అయిన ప్పుడు జరిగిన సంబరం సూడాలి కాని, సెప్పటానికి నోరు సాలదు దొరా. జంగం దొర తక్కువోడు అనుకుంటివేమో దొరా! పెద్దకొండ కంతకీ ఆడేదొర, మంచి అంద గాడు. అన్ని యిదాలా సివంగికి మంచి జోడీ.

కల్లుపార రోజులేమో. కల్లుముంతలు వందల కొద్దీ తాగేసి సంబరం జోరుగ జరిగి పోతోంది దొరా.

పిలవని పేరంటానికి ఆ రెడ్డిగాడు కూడ తయారు.

అట్టనే చౌదరయ్య పక్కనే నిలబడి సివంగినే సూపు.

సరింగా అర్థరాతిరి పదాన నాట్యం సివంగి, జంగం దొరలకి పట్టిందిదొరా. ఇదే దొరా! నువు సరింగా ఇనవలసింది. ఈ బరతం వుందే, యిది మా ఆచారం దొరా! ఆనాట్యం చేస్తుంటే సివంగిని సూడాల్సిందే దొరా. దాని యిట్టం వొచ్చినట్టు గెంతింది, ఆడింది. దాన్ని వాళ్ళంతా కదిలి పోతుంటే ఏ మడిసికీ వూపిరాడనేదు దొరా.

అంత జోరులో దానిమీద పడ్డాయిదొరా, పది రూపాయి బిళ్ళలు.

అంతే! నాట్యం ఆగిపోయింది. మగోళ్ల చేతులు కత్తులమీదకి. ఆడోళ్ళవి రాళ్ళ మీదకి.

ఎందుకంటావా దొరా? పెళ్ళి పదానంలో, అందులో జంగం దొరకు కాబోయే పెళ్ళాం సివంగి దొరసాని మీదకి, సంతలో దొమ్మరసాని మీద డబ్బు ఇసిరినట్టు, రూపాయిబిళ్ళలు ఇసరడం కంటె ఇంక అవుమానం ఏం వుంటది దొరా?





అయ్యాలకే రెడ్డి ఎనక్కి తిరిగి, పెద్ద డుగు లేసుకుంటా ఆడి మకాంకు నడిచి పోతుండు.

జనానికి అడ్డం పెళ్ళిండు చౌదరయ్య. "ఆడిదగ్గర తుపాకుంది జాగ్రత్త. రేపొడు ఇనపరాయికి పెద్దకొండ కెల్తాడు."

రేతిరి గడిచింది, సూర్యుడు లేకంగనే బయలుదేరిండు రెడ్డి. ఎక్కడికీ? ఎవరి కాబోయే పెళ్ళాంని అవమానించాడో ఆ జంగం దొర పెద్ద కొండకి.

నేను, రెడ్డి, ఈటిగాడు మళ్ళీ వురకలు పరుగులుతో మద్దాన్నం జంగందొర గూడెం జేరేము.

అక్కడ ఆచూకీ తీసిండు రెడ్డి ఇనప రాయి కోసం. ఆళ్ళ ;కొంతమంది రెడ్డిని కొండపయికి తీసుకెళ్ళినారు. మేము మకాము దగ్గిర ఉండిపోయినాము.

మేము ఆస్టేసేపు అక్కడ లేము దొరా. మళ్ళీ రేతిరికి ఇంటికి జేరుకున్నాము.

నీకర్ధమవతే దొరా? మాకు తెలుసు. తెలుసు. అవెల్లటం మళ్ళీ రెడ్డి తిరిగిరాడని!

ఎందుకంటావా? మాలో ఒక శాత్రం వుంది. "మా ఆడోళ్ళని ఎవడయితే అవమానం సేస్తడో వాడు రెండు సూర్యుల్లి మళ్ళీ సూడకూడదని."

మరి శాత్రం అంటే మాకు నమ్మకం!

అయితే. ఆడి శరీరం ఎక్కడుందో నంటావా? ఎట్ట దొరా! ఇల్లాంటోళ్ళకి మా శాత్రంలో శిచ్చ ఏంటంటే "ఆడి వొళ్ళంత బాగ తేనెపూసి కాళ్ళు చేతులు గట్టిగా కట్టేసి పెద్దఅడవిలో చీమల బారుల పుట్టల దగ్గర సచ్చిందాక పండబెట్టటమే."

మతీ. ఆ చీమలకి మీ ఇంసూరు రూళ్లు ఎట్ట తెలిసి చత్తుంది దొరా? కొంత శరీరం మిగల్చడానికి.

నాట్యంసేత్తున్న సివంగిమీదకి రూపాయి బిళ్ళలు ఆడు యిసరడం వొట్టి ఎదవపనంటావా దొరా?

మరక్కడే వుంది కిటుకు!

ఆడు ఎంత ఎదవయినా అంత తెలివి మాలినోడు కాదు.

నీ కసలర్ధం కాలేదు దొరా. రూపాయ బిళ్ళలు పడేటప్పుడు రెడ్డి ఎనక్కిమళ్ళీ నడక మొదలెట్టాడు.

రెడ్డిచేసిన తెలివిమాలిన పనల్లా. చౌదరయ్యకి పదిరూపాయి బిళ్ళలివ్వడమే!

తెలియలా దొరా!

అగీ కత. □□□

---

# ఆరుద్ర బాతాఖానీ

పాఠక మహాశయులారా!

మీకు క్రిందటిసారి బకాయిపడ్డ ధూపావళి ఆర్థికాభివందనములు ఈసారి సమర్పించుకుని కొత్త ముదరా రాతసాలను వెన్నవించుకుంటాము.

కాకవి పువ్వొత్తులు ప్రేలవు. చచ్చుబుడ్డి బాగా వెలగదు.

స్పెషలిస్టు డాక్టర్లు రోగుల పర్సుచూసి వైద్యం చేస్తారు.


లోకులు క్రాకుల వంటివారు. కోర్టు పక్షులమధ్య రచ్చగడ్డి వేస్తే దావా అగ్ని భగ్గున మండుతుంది. అక్కరకు రాని చట్టము.

తెలుగు జర్నలిజములో కొన్ని తిన పత్రికలు, కొన్ని జార పత్రికలు, కొన్ని మూస పత్రికలు ఉన్నాయి.

చిలుక పలుకులు పలికే శాసన సభ్యులు రాజకీర నాయకులు.

ఎట్లు, భయదీయుడు
ప్రూవు రేజరు





# వానలో నీతో

ఆకాశాన్ని మేఘం నల్లని కంబళిలా కప్పుకుంది
ఆనందం మనసులో మయూర బర్హంలా విప్పుకుంది
ఆలోచన లెందుకు జవ్వనీ- విలోకించు వర్షా సంధ్యని
సందేహం వదలి నా సందిటలో నిలిచి కళ్లెత్తి చూడు.

అరటితోట నడుంచుట్టి కాలువ ఏటవాలుగా మలుపు తిరిగింది
నారికేళ వనాంతాన ప్లాటినమ్ సంకేతంలా మెరపు మెరిసింది
నీ వొంటిమీద చిరుగంధం సువాసన నా మనస్సుని చుట్టుకుంది
నిర్ణిద్ర కాంక్షారమ్యమై నీపమై నా జీవితం విరిసింది.

చినుకుల కలనేత వస్త్రాన్ని సింగారించుకుంది ధరిత్రి
సిందువారం పులకరించి చిరుసిగ్గు పూలని పూసింది
ఆకు పచ్చని ఉత్సాహంతో విజృంభించింది ప్రాణశక్తి
ఆనంద వల్లరీ- ప్రేయసీ - అందించు నీ అధరామృత సూక్తి.

వానలో కానలో నాకు/అవిరామ ప్రాచీనత స్ఫురిస్తుంది
వార్షుకాభ్రం నాకు యక్షసతీ సౌందర్యాన్ని రచిస్తుంది
బాబిలోనియన్ ఈజిప్టు నాగరికతా స్తూపాల నీడలలో
ప్రాణప్రియా! మన మిరువురం మధువు సేవించినట్టు గుర్తుకొస్తుంది.

—బాలగంగాధర తిలక్